స్కెచ్ :

# అనుభవం

శ్రీ అడివి శివసుబ్రహ్మణ్యం

ఒరేయ్ శంకూ ఒకమ్మాయిని నేను లౌ చేస్తున్నానురా. ఆమె కూడా నన్ను లౌ చేస్తోంది కాని ఆమె తన అభిప్రాయాన్ని తెలియపరచలేక పోతోంది. ఆమెను పలుకరించే ఉపాయం ఏదైనా చెప్పరా అన్నాడు సుబ్బారావు.

సుబ్బారావుకు ప్రేమలో బొత్తిగా అనుభవంలేదు. ధైర్యమూలేదు.

అట్టే కొయ్యకుగాని, ఆ అమ్మాయి నిన్ను లౌ చేస్తోందని ఎట్లా అనుకుంటున్నావో చెప్పు అడిగాడు నర్సింహం హేళనగా.

నేను కాలేజీకి పోయే టైములోను, కాలేజి నుంచి వచ్చే టైములోనూ, ఆమె, మేడమీది కిటికీలో కూర్చుని, నన్ను చూస్తుంటుంది. ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నట్లుంటుంది వివాహం ఇంకా అయినట్లు లేదు. ఇంతకన్న నిదర్శనాలేం కావాలి ? అని, హీరోలా పోజు పెట్టాడు సుబ్బారావు

వెట్టి వెట్టి వేషాలకు పోతే, వాళ్ళ నాన్న గొడుగు కర్రో లేక, వాళ్ళ బామ్మ చీపురు కట్టో, నీ వీపు శుభ్రం చేస్తుంది. అంచేత, నా మాట విని, ఫామిలీ గరల్సు జోలికిపోకు సిగరెట్టు కిటికీలోంచి బయటకు విసురుతూ సలహా యిచ్చాడు మూర్తి.

ఒరేయ్ మూర్తి ఇలాటి చొప్పదంటు సలహా నివ్వద్దని ఎన్నిసార్లు చెప్పానురా నీకు చిరుకోపంతో అన్నాడు సుబ్బారావు.

అవునవును ఆ వీపు కాస్తా శుభ్రపడే వరకూ, ఎన్నిసార్లయినా చెప్తుంటావు జవాబిచ్చాడు మూర్తి.

చాల్లే కాని నోరు మూసుకో అని, శంకరం వైపు తిరిగి ఒరే శంకూ ఏదైనా, మంచి సలహా ఆలోచించరా అన్నాడు, సుబ్బారావు, చూడు సుబ్బాయ్ నేనేమీ సలహా ఇవ్వను కానీ ఒక సంఘటన ఏ కథలోది కాదు ఎవరి జీవితంలోదీ కాదు. ఈ మధ్య స్వయంగా నాకు జరిగిన అనుభవం చెపుతాను. దాని నుంచి, నువ్వేమైనా సలహా పొందగలిగితే మంచిదే అని, సావధానంగా, అందరివైపూ చూచాడు శంకరం.

అందరూ వినటానికి ఆసక్తి కనబరచారు

గంభీరంగా శంకరం ప్రారంభించాడు.

సుమారొక వారంరోజుల క్రిందట ఒక రోజు నా మిత్రుడొస్తాడని స్టేషనుకు వెళ్ళాను

అవును అన్నాడు మూర్తి. మధ్యలో

ఆ రోజు అతను రాలేదు. తిరిగి వచ్చేస్తున్నాను దారిలో, ఒక అందమైన, దాదాపు 18 సంవత్సరాల అమ్మాయి కనుపించింది.

ఏమిటి ? అమ్మాయా అంటూ చెవులు రిక్కబెట్టుకొని ముందుకు వచ్చాడు నర్సింహం

అవును ఆమె, నీలిరంగు నైలాన్ శారీ గులాబి రంగు వాయిల్ జాకెట్ ధరించింది.

ఆమె నల్లటి పొడవాటి జడ పిరుదులను తాకుతూ, నాట్యం చేస్తోంది ఆ పరిస్థితిలో నేనే కాదు ఎవరైనా తన్మయత్వం చెందక మానరు నాకు తెలియకుండానే, ఆమె వెనుకగా నా కాళ్ళు నడచాయి.

ఆమె, దారి వెంట నా వైపే చూస్తూ వెళ్ళింది. నేను కూడా సిలాగే ఆమె ఇంటి దాకా వెన్నాడాను.

ఆమె ఇల్లు ఒక చిన్న సందుతో వుంది ఆమెను పలుకరించటానికి వెంటనే ఒక అయిడియా తట్టింది ఆమె ఇంటిలోనికి వెళ్ళి,తలుపు వేసుకోగానే ఏమండీ అని తలుపు తట్టాను.

ఆమె తలుపు తీసింది ఏం కావాలండీ అంటూ ఆమె కంఠంలో దేవతల మనసులలోని నిర్మలత్వం కలసి వున్నాయి.

ఇంట్లో ఎక్కువమంది మనుషులున్నట్లు లేదు.

ఈ వీధిలో నారాయణరావుగారని కాలేజి లెక్చరరుగా రెవరైవనా ఉన్నారాండి ? అని అడిగాను.

అబ్బే ఈ వీధిలో కాలేజి లెక్చరరుగా రెవరూ లేరండి అందామె

ఇంతలో అమ్మడూ అని ఒక గొంతు లోపలనుంచి వినిప్పించింది

వస్తున్నానమ్మా అని ఆమె నా వైపు తిరిగి ఈ వీధిలో ఎవరూ లేరండి. ప్రక్క వీధిలో కనుక్కొండి అని లోపలికి వెళ్ళి తలుపులు వేసుకొంది.

నేను నాలుగడుగులు ముందుకు నడచాను. అంతలో వెనుకనుంచి ఏమండీ అనే పిలుపు వినిపించింది నేను వెనుకకు తిరిగాను.

మిమ్మల్నే నండీ ఇందాకటి అమ్మాయి పిలుస్తోంది

నన్నేనని నిర్ధారణ చేసుకొని. వెనుకకు వెళ్ళాను.

మీరు కాలేజిలో చదువుతున్నారాండి ? అంది ఆమె.

అంటే అన్నాను నేను. ఆమె ఉద్దేశ్యం అవగాహనకాక.

మరేంలేదు ఒక ఇంగ్లీషు ఉత్తరం వుంది దానిని చదివి తెలుగులో చెప్తారేమోనని అడిగింది ఆమె

నాకు పట్టరాని ఆనందం కలిగింది

ప్రాణం సంతోషంలో మునిగి లేచినట్లయింది

అల్లాగేలెండి అన్నాను అంగీకారం సూచిస్తూ.

ఆమె, లోపలికి రండి అంటూ ఇంట్లోకి నడచింది నేను వెంట నడచాను.

ఆమె ప్రక్క గదిలోకి వెళ్ళి ఓ కవరు తెచ్చి నా చేతిలో పెట్టింది నేను కూర్చుని కవరు తెరచాను అందులో విషయాలన్నీ చదివి తెలుగులో చెప్తున్నాను సగంవరకూ ఉత్తరం పూర్తయింది ఆమె వినటంలేదని సందేహం వచ్చి ఆమె ముఖంలోకి చూచాను ఆశ్చర్యం ఆమె నేను చెప్పేది వినటంలేదు ఆమె నయనాలు అశ్రుపూరితాలైనాయి

నేను చదివేది వినటంలేదన్నమాట అయితే ఇంక చదవనులెండి అన్నాను కొంచెం కోపంగా

ఇకనుంచి శ్రద్ధగా వింటాను చదవండి అంది ఆమె కనులు తుడుచుకుంటూ

అబ్బే వింటావని నమ్మకం ఏమిటి అసలు మీకు దుఃఖం ఎందుకు కలిగిందో చెప్పండి అన్నాను. ఆమె ఉత్తరం వింటుంటే రోదించటానికి కారణం తెలియక నేను చదివే ఉత్తరం ఒక ఇన్సూర్సు రెన్సు కంపెనీ నుంచి వచ్చింది

అందుకో విచారించ వలసిన విషయం ఏమీ లేదు.

ఏదో వెనుకటి సంఘటన జ్ఞాపకంవచ్చింది అది చెప్పి. మిమ్మల్ని కూడా బాధ పెట్టటం ఎందుకులెండి చదవండి ఇకవింటాను అంది ఆమె.

మీ విచారానికి కారణం చెప్పండి మనుషులు తమ విచారాన్ని తోటివారితో చెప్పుకుంటే కొంత హృదయ భారం తగ్గుతుంది కనుక చెప్పండి అన్నాను

ఆమె తన దుఃఖానికి కారణం చెప్పటానికుపక్రమించింది.

నాకొక అన్న వుండేవాడు అతడు నాకన్న రెండు సంవత్సరాలు పెద్దవాడు. మా తలిదండ్రులు సంతానం లేక, అనేక దేవుళ్ళకు మ్రొక్కి అనేక వ్రతాల ఫలితంగా మా అన్న వారికి కలిగేడట. మా అన్న పుట్టిన రెండు సంవత్సరాల తర్వాత, నేను పుట్టాను మగవాడు కావటంచేతను, లేక లేక కలిగిన వాడవటం చేతను మా అన్నను తలిదండ్రులు అతి గారాబంగా చూచేవారు అతనికి ఆ విధంగా చూడటం నాకు ఈర్ష్యను కలిగించేది అతడిప్పుడు ఈ లోకంలోలేడు ఒక సంవత్సరానికి పూర్వం రైలు ప్రమాదంలో మరణించాడు మున్మూర్తులా అతడూ మీరూ ఒకే పోలికలో వున్నారు ఆరోజుల్లో అతని యందు నాకు వుండే ద్వేషం జ్ఞప్తికివచ్చి దుఃఖం కలిగింది.

ఆమె నయనాల నుంచి అశ్రు కణాలు రాలుతున్నాయి

వెంటనే ఆ ఇల్లు విడచి ఆమె పిలుస్తున్నా వినిపించుకోకుండా వచ్చేశాను ఆ కవరును అక్కడే వదిలేసి

దీని నుంచి మీరేమైనా సలహా పొందగలిగితే ఆనందిస్తాను అంటూ సిగరెట్టు ముట్టించాడు శంకరం.

* * *

శ్రీ

జె. యస్. ఆర్. కె. ప్రసాదరావు

— కవిత : —

# సాహితీ కుసుమంబు!

తారలు ఒకదాని నొకటి
పెనవైచుకొనురీతి,

స్నేహపరిమళము లొండొరులు
వెదజల్లుకొనురీతి,

ఝరులు ఒకదాని నొకటి
ఒరసికొని పయనించురీతి,

వింత ఆకృతులనేకముల్ కలిసి
విచిత్రచిత్ర కృతులగురీతి,

కవులు – భావుకులు
పలువురొక్క దరి జేరురీతి,

అక్షరాక్షత లొక్కొకటి కలిసి
కవితకు సేసలు పెట్టినరీతి,

సాహితీ కుసుమంబులెల్ల
భారతీ పదపద్మ పీఠి జేరుగాత !